నిజాంసాగర్‌లో ప్రస్తుత నీటిమట్టం

# కాంగ్రెస్‌కు కాళేశ్వరమే దిక్కు

- నిజామాబాద్‌లో లోటు వర్షపాతం
- నిజాంసాగర్‌కు చేరని వరదనీరు
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- కొండపోచమ్మ నుంచి నిజాంసాగర్‌కు నీటి విడుదలకు నిర్ణయం

నిజామాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ సర్కారు తప్పని పరిస్థితిలో తిరిగి అదే ప్రాజెక్టుపైనే ఆధారపడాల్సి వస్తున్నది. వర్షాభావ పరిస్థితులకు తోడు ఉన్న నీటి నిల్వలను ఇష్టానుసారంగా వాడటంతో నిజాంసాగర్‌లో నీటి వనరులు తగ్గిపోయాయి. ఆయకట్టు కింద నార్లు పోసుకునేందుకు అదును దాటుతుండడంతో నీటి విడుదల అనివార్యమైంది. దీంతో కేసీఆర్ రూపొందించిన కాళేశ్వరం పథకంలో భాగంగానే కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం జలాలను నిజాంసాగర్‌కు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది.

### లోటు వర్షపాతంతో ఆందోళన

వానకాలం మొదలై నెల రోజులు కావొస్తున్నా లోటు వర్షపాతంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కొట్టుమిట్టాడుతున్నది. నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు ఈ ముప్పు తీవ్రంగా ప్రభావం చూపుతున్నది. ఎందుకంటే ఏటా జూన్ మొదటి వారానికే నాట్లు వేశారు. లక్షల ఎకరాలకు సాగు నీటి అవసరం ఏర్పడగా, నిజాంసాగర్‌లో నీటి నిల్వ ప్రమాదకరంగా మారింది. సాగుకు ఎలాగైనా నిజాంసాగర్ నీళ్లు ఇవ్వాలని రైతులు కోరుతుండటంతో చేసేది లేక పార్టీ మారిన ఓ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నుంచి గెలిచిన మరో ఎమ్మెల్యే కలిసి కొండపోచమ్మ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొండపోచమ్మ సాగర్ నుంచి నిజాంసాగర్‌కు రెండు టీఎంసీలు నీళ్లను తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

### రెండు టీఎంసీలకు అనుమతి వచ్చింది..

కొండపోచమ్మ సాగర్ నుంచి రెండు టీఎంసీల నీళ్లను నిజాంసాగర్‌కు తరలించేందుకు ఈఎన్‌సీ నుంచి అనుమతి వచ్చింది. ప్రస్తుతం నిజాంసాగర్‌లో మూడు టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఆయకట్టు రైతుల అవసరాల రీత్యా కొండపోచమ్మ సాగర్ నుంచి నిజాంసాగర్‌కు నీటిని తరలిస్తాం. నిజాంసాగర్‌కు వరద నీటి రాక మొదలైతే కొండపోచమ్మ సాగర్ నుంచి నీటి తరలింపు ఉండదు. పరిస్థితుల ఆధారంగా దీనిపై నిర్ణయం ఉంటుంది.

– శ్రీనివాస్, కామారెడ్డి నీటి, ఇరిగేషన్ శాఖ

# పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలి

- రాహుల్ గాంధీకి బీసీ రాజ్యాధికార సమితి లేఖ

హైదరాబాద్, జూన్28 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో సామాజిక న్యాయం సాక్షాత్కారం కావాలంటే పీసీసీ అధ్యక్షుడిగా బీసీలకే అవకాశం ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీకి శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణలో, దేశంలో భవిష్యత్తు రాజకీయాలు బీసీల చుట్టే తిరగనున్నాయని, బీసీల ఎదుగుదలను విస్మరిస్తే జాతీయ పార్టీలకు మనుగడ కష్టమేనని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు సీట్లు కేటాయించలేదని, ప్రస్తుతం పీసీసీ అధ్యక్ష పదవినైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పాలన గాలికి.. ప్రభుత్వం ఢిల్లీకి!

- ఆరు రోజులుగా ఢిల్లీలోనే సీఎం రేవంత్ మకాం
- డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలూ
- రాష్ట్రంలో అధికారిక కార్యక్రమాలు సైతం వాయిదా
- విస్మయం వ్యక్తం చేస్తున్న రాజకీయ వర్గాలు

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మకాం వేసి ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు రోజులు దాటింది. రోజూ పార్టీ అంతర్గత చర్చల్లో మునిగి తేలుతున్నారు. చెప్పుకోవడానికి మొదటి మూడు రోజులు నలుగురు కేంద్రమంత్రులతో భేటీ అయినా, తర్వాత రెండు రోజులు మాత్రం పూర్తి సమయం 'పెద్దల' వద్దే గడిపారని విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం ఒక్కరే కాదు.. డిప్యూటీ సీఎం, ఏడుగురు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీకి వెళ్లినవారిలో ఉన్నారు. కొందరు కొన్ని రోజులుగా అక్కడే మకాం వేయగా.. మరికొందరు అటెండెన్స్ వేసుకొని తిరిగి వచ్చేశారు. గత ఐదు రోజుల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ కూడా ఢిల్లీకి వెళ్లి వచ్చారు. ముగ్గురు మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, దామోదర రాజనర్సింహ తప్ప మిగతా మంత్రులంతా హైదరాబాద్–ఢిల్లీ మధ్య చక్కర్లు కొట్టారు. ఈ తతంగం మొత్తాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే 'పాలనను గాలికి వదిలేసి ప్రభుత్వం ఢిల్లీకి వెళ్లినట్టుంది' అని రాజకీయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పెద్దలంతా ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతుండటంతో రాష్ట్రంలో పాలన గాడి తప్పుతున్నదని చెప్పున్నారు. ప్రతిరోజు పర్యవేక్షించాల్సిన, అత్యంత కీలకమైన శాఖలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరే ఉన్నాయి. హోం, విద్య, మున్సిపల్ వంటి కీలక శాఖలన్నీ సీఎం వద్దే ఉన్నాయి. వరుస నేరాలతో రాష్ట్రంలో కొన్ని రోజులుగా పోలీసింగ్ గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు స్కూళ్లు, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లతో హడావుడిగా ఉన్నది. ఇలాంటి కీలక సమయంలో ఆయా శాఖలను పర్యవేక్షించాల్సిన సీఎం.. ఢిల్లీలో మకాం వేయటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు.

### పార్టీ చర్చలపైనే శ్రద్ధ

ఐదు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాలన కన్నా పార్టీ చర్చలపైనే శ్రద్ధ పెట్టినట్టు విమర్శలు వస్తున్నాయి. ఎంపీల ప్రమాణస్వీకారం కోసం అంటూ ఆయన సోమవారం ఢిల్లీకి వెళ్లారు. అక్కడ సోమవారం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్, మంగళవారం కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, బుధవారం కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. గురు, శుక్రవారాల్లో పూర్తిగా పార్టీ చర్చలకే పరిమితం అయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అలక, క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు, పీసీసీ అధ్యక్షుడి నియామకం వంటివి చర్చిస్తున్నారు. వాస్తవానికి ఆయన గురువారం రాత్రి తెలంగాణకు వచ్చి.. శుక్రవారం వరంగల్‌లో పర్యటించాల్సి ఉన్నది. కానీ ఆ కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేశారు. ఇక.. జీవన్ రెడ్డి అంశం మినహా మిగతా అన్ని అంశాలపై కొన్ని వారాలుగా చర్చోప చర్చలు జరుగుతున్నవేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దాదాపుగా తుది నిర్ణయానికి వచ్చేసినట్టేనని అంటున్నాయి. వెంటనే నిర్ణయం ప్రకటించకుండా ఐదు రోజులుగా నాన్చుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఢిల్లీలో ఐదు రోజులుగా జరుగుతున్న పరిణామాలపై ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు చెప్పుకునేందుకు సచివాలయానికి వస్తే ఎవరూ అందుబాటులో ఉండటం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం, మంత్రులతోపాటు పలువురు ఉన్నతాధికారులు సైతం ఢిల్లీకి వెళ్లాల్సి వస్తున్నది. ఇదే అదనుగా ఆయా శాఖల్లో అధికారులు ఆఫీస్ పనులపై పెద్దగా దృష్టిపెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటివి కాంగ్రెస్‌లో సహజమే.. ప్రజలే మళ్లీ అలవాటుపడాలి అంటూ ఆ పార్టీ నేత ఒకరు చెప్పడం కొసమెరుపు.

# ఆయారాంలకు పదవుల్లేవ్

మొదటిపేజీ తరువాయి...

ఆదాయం పెరిగిందని సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వం ప్రతినెల రూ.350 కోట్లు చెల్లిస్తున్నదని వివరించారు. దీంతో నిర్వహణ నష్టాలు తగ్గాయని, ఆక్యుపెన్సీ 30 శాతం నుంచి 80 శాతానికి పెరిగిందని వెల్లడించారు. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ లాభాలతో నడుస్తున్నదని చెప్పారు. ధరణిలో ఉన్న లోపాలు సరిచేసే పనిలో ఉన్నామని, పేరు మార్పుపై తర్వాత ఆలోచిస్తామని అన్నారు. భూముల రికార్డులను కంప్యూటరైజ్డ్ చేయాలా? గతంలో మాదిరిగా మాన్యువల్ పద్ధతి పాటించాలా? అనేది అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మండలాలు, రెవెన్యూ డివిజన్ల మార్పుపై కమిషన్ నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నదని, రూ.లక్ష కోట్ల వరకు పెండింగ్ బిల్స్ ఉన్నాయని వివరించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ.6,500 కోట్లు కట్టేవారని, ఇప్పుడు నెలకు రూ.7వేల కోట్లు అప్పులు కడుతున్నామని చెప్పారు.

### అదానీకి ఇస్తే తప్పేముంది

పాత బస్తీలో విద్యుత్ బిల్లుల వసూళ్ల బాధ్యతను అదానీ కంపెనీకి అప్పగించామని, అందులో తప్పేముందని సీఎం ప్రశ్నించారు. అక్కడ అండర్ గ్రౌండ్ విద్యుత్తు లైన్లు వేసి మొత్తం వ్యవస్థను మార్చాలని కోరామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆస్తులను అదానీకి అప్పగించడాన్ని రాహుల్ గాంధీ తప్పు పడుతున్నారని, అంతేతప్ప అదానీతో వ్యాపారం చేయొద్దని ఎప్పుడూ అనలేదన్నారు.

### 4 రోజుల్లో రుణమాఫీ మార్గదర్శకాలు

రూ.2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని సీఎం వెల్లడించారు. రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు, ఇతర పథకాలపై దృష్టి పెడతామని వివరించారు. పంట రుణాలు మాత్రమే మాఫీ అవుతాయని, బంగారంపై తీసుకున్న రుణాలకు వర్తించదని స్పష్టంచేశారు. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుందని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, అంతరాయాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

### దుబాయ్‌లో తప్పిపోయిన జగిత్యాలవాసి

- విదేశాంగ శాఖ మంత్రికి ట్వీట్ చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 28 : జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వడ్లకొండ మల్లేశ్ వారం క్రితం ఓమన్–యూఏఈ సరిహద్దులో తప్పిపోయాడని, అతను క్షేమంగా వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మల్లేశ్ 15 రోజుల క్రితం దుబాయ్ వెళ్లగా ఓమన్–యుఏఈ సరిహద్దులో అక్రమంగా దాటుతుండగా పుజీరా, యూఏఈ జైల్లో వేసినట్టు తమకు తెలిసిందని అన్నారు. మల్లేశ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తితో స్పందించిన జీవన్‌రెడ్డి.. అతని ఆచూకీ తెలుసుకొని, క్షేమంగా రప్పించేలా చూడాలని కోరుతూ మస్కట్, దుబాయ్‌లోని భారత రాయబారులకు, కేంద్ర విదేశాంగ మంత్రికి, ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు కలెక్టర్, ఎస్పీకి ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు.

# రెండ్రోజుల్లో పీసీసీ అధ్యక్షుడి ప్రకటన!

- రాష్ట్ర నేతలతో సంప్రదింపులు పూర్తి
- ఇద్దరి పేర్లను ప్రతిపాదించిన సీఎం
- తుది నిర్ణయం అధిష్ఠానం కోర్టులో...
- కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడి ఎంపికపై రెండు రోజులుగా ఢిల్లీలో కొనసాగుతున్న కసరత్తు కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఒకటి రెండు రోజులలో కొత్త పీసీసీ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల సమాచారం. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ప్రస్తుత పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి మాట నెగ్గుతుందా? లేక ఇతరుల మాట నెగ్గుతుందా? అనేది కాంగ్రెస్ వర్గాలలో ఆసక్తికరంగా మారింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ లేక మహబూబాబాద్ ఎంపీ బల్‌రాం నాయక్ పేర్లను రేవంత్‌రెడ్డి ప్రతిపాదించినట్టు సమాచారం. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో మొదట చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి అభిప్రాయాన్ని సేకరించింది. ఆ తర్వాత మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితర ముఖ్య నాయకుల అభిప్రాయాలను కూడా తీసుకున్న ఆమె పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు నివేదించినట్టు తెలిసింది. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో అనుసరించాల్సిన సామాజిక సమీకరణలపై సీఎం తన వాదనను అధిష్ఠానానికి వినిపించగా, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో చర్చించిన అనంతరం రెండు, మూడు రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ప్రకటించనున్నట్టు కేసీ తెలిపినట్టు సమాచారం.

### కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే

చేవెళ్లకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్యను సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వద్దకు తీసుకెళ్లి పార్టీ కండువా కప్పించారు.